
# వారసత్వ సంపద

- సుధారమ



చిత్తుకాగితాల దుకాణం నడిపే దేశ్ పాండేకి నాకూ ఉన్న స్నేహం ఈనాటిది కాదు. పొట్ట పట్టుకుని మా అన్నయ్య ఇక్కడ ఉద్యోగంలో ఉన్నాడని - నాకూ ఓ ఉద్యోగం రాకపోతుందాని ఈ ముంబయి నగరానికి వచ్చి నప్పట్నుంచి అతడు నా ప్రాణ స్నేహితుడయ్యాడు. ఇంటర్వ్యూకి వెళ్ళడానికి అతడి చేత్తో ఇచ్చిన డబ్బుతో వెళ్ళాను. అనుకోకుండా ఆ ఉద్యోగం వచ్చింది. మిఠాయి తీసికెళ్ళి ఇచ్చాను. నాకన్నా ఎక్కువగా సంతోషించాడు.

ముఖ్యంగా చిత్తుకాగితాలకింద ఎందరో పడేసే మంచి పుస్తకాలని ఏరిపెట్టేవాడిని. మరాఠీ నాకప్పట్లో రాకపోయినా చక్కటి హిందీ, ఇంగ్లీష నవలల్ని పక్కకు తీసి నాకు తోచిన ధర ఇచ్చేవాడిని. వెలకట్టలేని వాటికి వెలకట్టే యత్నంలో (పుస్తకాలకీ, స్నేహానికీ కూడా) అలా ఎన్నో కాసిక్కూ, మంచి పుస్తకాలూ నా చిన్నారి గ్రంధాలయంలో చేరాయి. 'వన్‌రూమ్‌కిచెన్' అనబడే నా బుల్లి అగ్గిపెట్టె ఇంట్లో చిన్నారి లైబ్రరీ నా జీవితంలో వసంతమై వచ్చిన గృసంతకీ పుస్తకాల పిచ్చే.

అలాంటి అలవాటుతోనే ఆరోజు దేశ్‌పాండేతో కబుర్లాడుతూ పుస్తకాలు వెదుకుతున్నాను 'నిజమా - కలా' అర్థం కాలేదు. 'మహాప్రస్థానం' 'అమృతం కురిసిన రాత్రి' 'చివరకు మిగిలేది' 'కృష్ణపక్షం' 'ఊర్వశి' 'చిలుకలు వాలిన చెట్టు' 'వేయిపడగలు' 'హిమజ్వాల' వర్సగా ఓ పెద్ద మూట నిండా పుస్తకాలు. కొన్ని నా దగ్గరున్నాయి. కొన్నిటికోసం ఆంధ్రా వెళ్ళినప్పుడంతా గాలిస్తున్నా 'ఇవన్నీ...ఎలా

వచ్చాయి. ఎవరు అమ్మారు చిత్తుకింద' ఆశ్చర్యంతో, కొంత బాధతో అడిగాను. 'ఆ'శాంతిసాగర్' బిల్డింగ్‌లో లేదూ' దేవుసాహెబ్ అతను అమ్మాడు. మీ భాషవాసార్ కావాలంటే ఊరికేనైనా తీసికెళ్ళండి అన్నాడు. ఎప్పట్లా నిర్మలమైన నవ్వుతో 'చూడూ' ఇది చిత్తుకింద పంపకు ఈ పుస్తకాలన్నిటికీ తూకానికి రెట్టింపు ధర నేనిస్తాను అదనలు చాలా తక్కువే అనుకో, రేపు పొద్దునే వచ్చి నేనీ సంచి తీసికెళ్తాను, అన్నాను. చేతుల్లో సరుకులూ, కూరగాయలూ ఉన్నాయి మరి. 'చలేగాసాబ్' అన్నాడు.

ఈ యాంత్రిక ప్రపంచంలో పరుగుల లోకంలో ముంబయి పట్టణంలో పక్కనే ఉన్నా పలకరించుకునే తీరికుండదు. దేవ్ నాకు బాగా తెలుసు. మా పక్క ఆఫీసే చర్చిగేట్ దగ్గర. ఇద్దరం ఒకే రైళ్లో వెళ్తాం. అలా పరిచయం. తెలుగువాడేనని తెలుసు. కానీ అతడికి తెలుగు సరిగ్గా రాదు. హిందీలోనే ఎక్కువగా మాట్లాడతాడు. ఇక్కడే పుట్టి పెరగడం వల్ల అలా అలవాటై పోయిందంటాడు. మరి తన దగ్గర ఇన్ని తెలుగు పుస్తకాలు ఎలా వచ్చాయి? ఈ మధ్యనే వాళ్ళ నాన్నగారు చనిపోయినట్టు విన్నాను. వారం రోజులుగా ఆఫీసుకి రావడం లేదు. పలకరించి, పరామర్శించినట్టూ ఉంటుంది. ఈ పుస్తకాల సంగతీ తెలిసిపోతుందని రాత్రి తొమ్మిదయినా బయల్దేరా ఇక అప్పుడేగా తీరిక, మళ్ళీ తెల్లారితే పరుగు ఎనిమిదీ పదహారు బండి పట్టుకోవాలి (8.16) ఇలా ఉంటుంది జీవితం.

దేవ్ ఇంట్లోనే ఉన్నాడు. వాళ్ళ నాన్నని ఒకే ఒక్కసారి చూసాను. తెల్లగా పెరిగిన గడ్డం. తల వెంట్రుకలు కత్తిరించుకోడేమో, సిగలా చుట్టాడు. ముఖంలో ఏదో ప్రశాంతమైన వెలుగు, పావురాలకి గింజలు వేస్తూ కింద కాంపౌండులో కన్పించాడు. దేవ్ పోలికల వల్ల పోల్చుకున్నాను వాళ్ళ నాన్నే అయి ఉండచ్చని. నిజానికి ఇలా పరామర్శించడం చాలా ఇబ్బందిగా ఉంటుంది నాకు. 'ఎలా పోయారు? ఏమైంది. యాంత్రిక మైన ప్రశ్నలు.

ఏముందీ - ముసలితనం, పొద్దున్నే మామూలుగా పావురాలకి గింజలు వేసాడు. అంగన్ వాడీలో అదే ఇక్కడ వెనకాల ఓ 'స్లమ్' ఉందిలే - ఆ పిల్లలకి రోజూ రొట్టెలు తీసుకెళ్ళి ఇస్తాడు. అల్లాగే ఇచ్చి వచ్చాడు ఏదో పుస్తకం చదువుతూ కూర్చున్నాడు. భోజనానికి పిలిస్తే పలకలేదు. చలనం లేదు. డాక్టర్ని పిల్చింది నా భార్య తెల్సిపోయింది అప్పటికే పోయాడని మామూలుగా అన్నాడు. అతడి భార్య మరెవరితోనే చెప్పుకుపోతుంది. 'అనుకోకూడదు గానీ ఈ మూడుగదుల ఇల్లు ఆయనే లోను తీసి కొన్నారట అప్పట్లో పిల్లాడు చదువు కోవాలంటే కూడా ఆయన గదిమాత్రం వదల్డు. ఆయన పుస్తకాలూ ఆయనే. పెన్షన్లో సగమంటే సగమే ఇంటికిచ్చేవాడు. మిగతాదంతా దానధర్మాలే. ఏదుంటే ఏది పెడితే అది తినేవాడు. చాతనయితే బజారుపనీ చేసేవాడు. మేమిద్దరం ఉద్యోగాలకి వెళితే వాడిని కనిపెట్టుకునే వాడు.

దేవ్ చెప్పసాగాడు. 'మానాన్న ఆ పుస్తకాలకి ఎంత డబ్బు తగలేసాడో. మమ్మల్ని తెలుగు నేర్చుకోమన్నాడు. మేమెవరం నేర్చుకోలేదు పోనీ ఇంగ్లీషు, హిందీ, మరాఠీ పుస్తకాలైనా చదవండని పోరేవాడు మా వాడికీ పుస్తకాల పిచ్చి ఎక్కించాలని చూసాడు. నేను పడనియ్యలేదు. ఇప్పుడున్న పోటీ ప్రపంచంలో వాళ్ళకున్న చదువే వాళ్ళకు చాలు. పైగా ఈ ధానధర్మాలొకటి. ఆ పుస్తకాలన్నీ చిత్తు కాగితాలకు వేసి రూము శుభ్రం చేయించాను, మా

**మేరీ మాత జన్మదినం**

మేరీ మాతను ఆరోగ్య మాత అని కూడా పిలుస్తారు. ఈ తేదీన ఆరోగ్యమాత జన్మదినంగా పరిగణించి ప్రత్యేక ఉత్సవాలు నిర్వహిస్తారు. సైఫాబాదు (హైదరాబాదు)లో 1904లో స్థాపించబడిన **సెయింట్ కెథడ్రాక్ చర్చి**లో నాటి నుండి ప్రతి సం॥ ఆరోగ్య మాత ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ చర్చి అసలు పేరు **"చర్చ్ ఆఫ్ అవర్ లేడీ డి వైన్ గ్రీస్"** ఈ చర్చి హైదరాబాదు లోని చాలా చర్చిలకు మాతృసంస్థ లాంటిది.

వాడికి ఓ 'స్టడీరూము' ఏర్పాటు చేసాను. ఏమంటే ఆయన నాకీ ఇల్లు ఇచ్చిపోయాడు. వారసత్వ సంపదగా వేరే ఏం లేకపోయినా ఎంత లేదన్నా ఈ ఫ్లాటిప్పుడు పదిలక్షలు చేస్తుంది. ఆయన పేరు చెప్పుకోవాల్సిందే. పన్నెండోరోజూ, పదమూడోరోజు కర్మలప్పుడు తప్పకుండా రానీవు, బాగా చేయిస్తున్నా ఉన్నంతలో !.

ఇంటికి తిరిగి వచ్చాక కళ్ళు మూతలు పడనీయని కలవరం. తెల్లగడ్డంతో సాటి మనుషుల్నీ జంతువుల్నీ, సాహిత్యాన్నీ ప్రేమిస్తూ గడిపిన దేవ్ నాన్న డబ్బుల్తో వారసత్వ సంపదల్ని కొల్చుకుంటాము. నిజమే. వాళ్ళ నాన్న అందించబోయిన సాహితీ సుగంధాల్ని వాళ్ళందుకోలేదు పోనీ ఆయనలో ఉన్నంత దయాసింధువులో ఓ బిందువైనా వీళ్ళకి చెందలేదు నిజంగా మన సంతతికి మన వారసత్వ సంపదని ఇవ్వగలమా ? పోనీ డాక్టరు కొడుకు డాక్టరు కావాలనీ, రాజు కొడుకు రాజే కావాలని అనుకుంటే అది తప్పే, ఎవరి అభిరుచిని బట్టి వారు. కాని ఆ సంపదకి విలువైనా ఇవ్వాలి కదా !.

నిద్రపోతున్న వసంతని తట్టి లేపాను. 'నీ కడుపులో నిద్దరోతున్న చిట్టిపాపాయి కవయిత్రి అవుతుందా' అన్న నా ప్రశ్నకి నిద్దట్లోనే చలం 'సుధ' లో వాక్యాల సారాంశాన్ని కలవరించింది. నిజమే తనలోంచి తీయని నీళ్ళున్న కాయ పుట్టుకొస్తుందని కొబ్బరిచెట్టుకు తెలీదు. అసలు ఏ కాయగా అది రూపు దిద్దుకుంటుందో తెలీదు.

కానీ నా చిట్టి పాపాయికి ఇంత మాత్రం చెప్తాను 'ఇవన్నీ – ఈ నా బంగారు నేస్తాలన్నీ' ఈ పుస్తకాలన్నీ నా సంపద. నీవు దాన్ని వారసత్వంగా స్వీకరించకున్నా ఏ తెలుగు గ్రంధాలయానికో ఇవ్వుతల్లీ చిత్తుకాగితాలకి అమ్మకు" అని ఇక నిద్రపోవాలిగా రేపు కొత్త ఉత్సాహంతో శ్రీశ్రీ కృష్ణశాస్త్రి ఆరుద్ర, విశ్వనాధల్నందర్నీ ఇంటికి తీసుకు రావాలి. ★


## వినుకొండ సాహిత్య మాసపత్రిక

### వ్యాపార ప్రకటనలు

**లోపలి పేజీలలో :**

| | |
|---|---|
| క్లాసిఫైడ్స్ (5 లైన్లు) | - రూ. 200/- |
| 1/4 పేజీ (బ్లాక్ & వైట్) | - రూ. 600/- |
| 1/2 పేజీ (బ్లాక్ & వైట్) | - రూ. 1,100/- |
| ఫుల్ పేజీ (బ్లాక్ & వైట్) | - రూ. 2,000/- |

**మల్టీకలర్ లో :**

| | |
|---|---|
| కవర్ పేజీ లోపల 1/2 | - రూ. 2,500/- |
| కవర్ పేజీ లోపల | - రూ. 4,000/- |
| కవర్ పేజీ వెనుక | - రూ. 6,000/- |